RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 19 బుధవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 196 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | WEDNESDAY AUGUST 19 2026 | VOL:16 | ISSUE: 196 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# ప్రతి ఆరు నెలలకు ఒక మేజర్ హాస్పిటల్: సీఎం రేవంత్ కీలక ప్రకటన

**సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం**

**ప్రతి ఆరు నెలలకు ఒక ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తామని సీఎం రేవంత్ ప్రకటన**

**2027 చివరి నాటికి 10,000 పడకలు ఏర్పాటు చేయడమే లక్ష్యం**

**32 నెలల్లో వైద్యంపై రూ.21,800 కోట్లు ఖర్చు చేశామన్న ప్రభుత్వం**

**గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితమైందని రేవంత్ విమర్శ**



హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో అత్యాధునిక వసతులతో నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రతి ఆరు నెలలకోసారి ఒక ప్రధాన ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా సీఎం కీలక ప్రకటన చేశారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పునర్నిర్మాణంతో పాటు ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2027 డిసెంబర్ నాటికి ఈ ఆసుపత్రులన్నింటినీ పూర్తి చేసి, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో అదనంగా 10 వేల పడకలను అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్య

(మిగతా 2వ పేజీలో..)

## పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు.. రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!



**ఇప్పటివరకూ ఇదే అత్యధిక కార్పస్**

**పొదుపు ఖాతాల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లకు నిధుల మళ్లింపు**

**పెట్టుబడుల వ్యూహం మార్పుతో పెరిగిన రాబడి**

**కొవిడ్ బాధితుల పిల్లల కోసం కొనసాగుతున్న ఖర్చులు**

పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి

(మిగతా 2వ పేజీలో..)

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం: కవిత

**భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత**

**రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ**

**రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు.

(మిగతా 2వ పేజీలో..)




## సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం.. టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

**సీఎం విజయ్ కార్యాలయం ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్పు**

**రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకే ధ్వజం**

**పాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణ**



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన కార్యాలయాన్ని ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్చాలని తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం సిబ్బందికి సౌకర్యవంతమైన పని వాతావరణం కల్పించేందుకు ఈ మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించగా... కొత్త ఆఫీసు పనుల కోసం కేటాయించిన రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ

(మిగతా 2వ పేజీలో..)

## మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్ రావు

**రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు**

**పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య**

**కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు**

సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని,

(మిగతా 2వ పేజీలో..)



# రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ.. మేం చేసి చూపించాం: తుమ్మల నాగేశ్వరరావు

రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్న మంత్రి తుమ్మల

**గతంలో విడతలవారీగా చెల్లించి రైతులపై రూ.2,630 కోట్ల వడ్డీ భారం మోపారని ఆరోపణ**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విడతలో రూ.20,617 కోట్లు మాఫీ చేసిందని వెల్లడి**

కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ ప్రక్రియ అత్యంత పేలవంగా సాగిందని ఆయన ఆరోపించారు. రైతు



(మిగతా 2వ పేజీలో..)

## కల్తీపై ఉక్కుపాదం..

### తెలంగాణలో కొత్తగా 'టీజీ సేఫ్'

**టీజీ సేఫ్ తొలి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అవినాష్ మహంతి**

**ఆహార, ఔషధాల కల్తీని అరికట్టడమే ప్రధాన లక్ష్యం**

**పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని క్యూర్ ఏరియాలో అమలు**

తెలంగాణలో ఆహార, ఔషధాల కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

## ప్రతి ఆరు నెలలకు ఒక మేజర్ హాస్పిటల్: సీఎం రేవంత్ కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

రంగాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం టిమ్స్ ఆసుపత్రులకు కేవలం శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుందని, తమ ప్రభుత్వం వాటిని పూర్తి చేసి ఆచరణలో చూపిస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన 32 నెలల పాలనలో ప్రజారోగ్యంపై రూ. 21,800 కోట్లు ఖర్చు చేసిందని, ఇందులో ఆరోగ్యశ్రీ కింద రూ. 2,700 కోట్లు, సీఎం సహాయ నిధి నుంచి రూ. 2,500 కోట్లు వెచ్చించామని తెలిపారు. వైద్యం, విద్యపై పెట్టే ఖర్చును తాము భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడిగా భావిస్తామని ఆయన పేర్కొన్నారు. అదనపు పని గంటలు కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు, సిబ్బందికి తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, అంతర్జాతీయ స్థాయిలో వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇదే వేదికపై నుంచి 'టీజీ సేఫ్', 'ఆరోగ్య దీపిక' పాలిక్లినిక్‌లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. వెయ్యి రోబోటిక్ సర్జరీలు పూర్తి చేసిన నిమ్స్ వైద్య బృందాన్ని, ఆసుపత్రి నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించారు.

## పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు.. రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!

(మొదటి పేజీ తరువాయి)

గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి.గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ. 5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ. 479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ. 92.83 లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ. 324.66 కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలో చేరాయి. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఈ ఫండ్ ద్వారా కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు చేయూతనిచ్చే 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' పథకం కింద వ్యయం చేస్తున్నారు.

## మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ఏ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ఏ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

## సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం.. టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ, డీఎంకేలు ధ్వజమెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై బీజేపీ నాయకుడు కేశవన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొత్త ఆఫీస్ పనులు ఇప్పటికే ప్రారంభమైన నెల తర్వాత, ఎలాంటి ఆన్‌లైన్ విధానం అనుసరించకుండా రూ. 5.5 కోట్ల టెండర్‌ను విడుదల చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి కేవలం 100 రోజులు కూడా కాకముందే పాలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు కేటాయించడంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మరోవైపు, డీఎంకే ఎమ్మెల్యే ఈవీ వేలు స్పందిస్తూ.. సీఎం తన కార్యాలయాన్ని మార్చుకోవడం ఆయన వ్యక్తిగత విషయమని, అయితే ప్రజాధనంతో ముడిపడి ఉన్న టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. అయితే, ఈ అవినీతి ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి కేవలం 100 చదరపు అడుగుల స్థలం కూడా లేదని, వారికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకే ఈ తాత్కాలిక మార్పు చేపట్టామని వివరించారు. ఈ పనులకు సంబంధించి టెండర్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తేల్చిచెప్పారు.

## రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ.. మేం చేసి చూపించాం: తుమ్మల నాగేశ్వరరావు

(మొదటి పేజీ తరువాయి)

రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ఆయన గణాంకాలతో సహా వివరించారు. 2014లో మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చినప్పటికీ, లక్ష రూపాయల రుణమాఫీని బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకేసారి అమలు చేయలేకపోయిందని గుర్తుచేశారు. నాలుగేళ్ల పాటు విడతల వారీగా నిధులు విడుదల చేయడంతో రైతులపై అదనంగా రూ. 2,630 కోట్ల వడ్డీ భారం పడిందని తెలిపారు. ఇక 2018లో మళ్లీ లక్ష రూపాయల రుణమాఫీ హామీ ఇచ్చి, కేవలం సగం మంది రైతులకే వర్తింపజేసి, మిగిలిన రూ. 8,379 కోట్ల బకాయిలను పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. పదేళ్ల పాటు రైతులను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు వారిపై కపట ప్రేమ చూపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి పంట కాలంలోనే ఏకకాలంలో రూ. 20,617 కోట్ల రుణాలను మాఫీ చేసిందని తుమ్మల వెల్లడించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 25,35,964 మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలను అత్యంత పారదర్శకంగా మాఫీ చేయడం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని వివరించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకే పంట రుణ బకాయిలు అత్యంత తక్కువగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివేదిక ధ్రువీకరించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

## కల్తీపై ఉక్కుపాదం.. తెలంగాణలో కొత్తగా 'టీజీ సేఫ్'

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన 'తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్)' తొలి కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అవినాష్ మహంతి బాధ్యతలు స్వీకరించారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు, ఆహార పదార్థాలు, నిత్యావసర ఔషధాల నాణ్యత, భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయడమే లక్ష్యంగా ఈ నూతన వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.రాష్ట్రంలో ఫుడ్ లైసెన్సులు పొందిన వ్యాపార సంస్థలు, ఫార్మా కంపెనీల సంఖ్య గణనీయంగా పెరగడంతో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే, ఇప్పటివరకు వేర్వేరుగా కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి 'టీజీ సేఫ్'ను రూపొందించారు. నాణ్యత లేని, కల్తీ ఆహార ఉత్పత్తులతో పాటు నకిలీ ఔషధాల తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ఈ నూతన అథారిటీ ప్రధాన ఉద్దేశ్యం.ఈ రెండు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచి, తనిఖీలను ముమ్మరం చేయడం ద్వారా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా, ఫుడ్, ఫార్మా వ్యాపారాలు అధికంగా కేంద్రీకృతమై ఉన్న హైదరాబాద్‌లోని క్యూర్ ఏరియాలో ఈ ఏకీకృత వ్యవస్థను అమలు చేయనున్నారు.

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి.. రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: శ్రీధర్ బాబు

తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు.ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.



తెలుగు దినపత్రిక
# దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

ఆగస్టు | బుధవారం | 19 | 2026



## షైన్ హైస్కూల్‌లో ఘనంగా వ్యసన విముక్తి ప్రతిజ్ఞ







**ఖమ్మం ప్రతినిధి ఆగష్టు 18(దేశ టైమ్స్ )**

10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ మహా ఉద్యమంలో భాగంగా స్థానిక షైన్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జీవితంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాలను స్వీకరించబోమని, కుటుంబాన్ని, సమాజాన్ని వ్యసనాల బారినుంచి కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళ సీతారామయ్య, పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

**వలిగొండ,ఆగస్టు18(దేశ టైమ్స్)**

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, కొండూరు ఆంజనేయులు గౌడ్, కొండూరు వెంకటేశం, బంధారపు లింగస్వామి, బత్తిని దేవేందర్, పబ్బు స్వామి, బత్తిని నరసింహ, పంజాల రమేష్, కాసుల పెద్దులు, పబ్బు మల్లయ్య, కొండూరు సత్తయ్య, బత్తిని అరుణ్, కొండూరు సాయి,



రమేష్,ఇస్తాయి,తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు/ బీఎస్పీ పార్టీ

**రుద్రంగి ఆగస్టు18(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ (దీస్రా) ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీస్రా రుద్రంగి మండల అధ్యక్షులు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు పాపన్న గౌడ్ జీవిత చరిత్ర, ఆయన పోరాటం, సామాజిక దృక్పథం, అణగారిన వర్గాల కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక పాపన్న గౌడ్ అని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక యోధుడు మాత్రమే కాకుండా, సామాజిక అసమానతలను ప్రశ్నించిన ధైర్యశాలి అని అన్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమానత్వం, స్వాభిమానం ఉండాలని తన పోరాటం ద్వారా చాటి చెప్పారని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ చరిత్రను కేవలం జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా, ఆయన పోరాట స్ఫూర్తిని యువతలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. దీస్రా సీనియర్ నాయకులు కట్కూరి శంకర్ మాట్లాడుతూ.. చరిత్రలో అణగారిన వర్గాల నుంచి ఎదిగిన మహనీయుల త్యాగాలు, పోరాటాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి



ఒక్కరిపై ఉందన్నారు. పాపన్న గౌడ్ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు దయ్యాల ఉదయ్ మాట్లాడుతూ.. రుద్రంగి మండలంలో బహుజన మహనీయుల జయంతి వేడుకలను నిరంతరం నిర్వహిస్తూ వారి చరిత్రను ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు. యువతలో చారిత్రక అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఎనుగందుల సతీష్, గ్రామ అధ్యక్షులు నల్ల నవదీప్, లింగాల రవి, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి సుదర్శన్, కోశాధికారి కర్రె గణేష్, కట్కూరి వినోద్, మండల కోశాధికారి కాదాసు అనిల్, సలహాదారు కాదాసు సంతోష్తో పాటు దీస్రా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారులపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలి

**వలిగొండ,ఆగస్టు18(దేశ టైమ్స్):**

భువనగిరి--చిట్యాల ప్రధాన రహదారితో పాటు మండలంలోని వివిధ రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బొల్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. మంగళవారం భువనగిరి--చిట్యాల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గుంతల్లో పడి ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు ధర్నాలు చేపట్టినా అధికారుల్లో స్పందన కనిపించడం లేదని అన్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, సంబంధిత అధికారుల కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, రాస వెంకట్, బచ్చు శ్రీనివాస్, పాక పుల్లయ్య, బొడిగె ఆనంద్, కందుల తానేష్, మంద నరసింహ, రావుల పద్మారెడ్డి, మందుల నాగరాజు, రంజిత్ రెడ్డి, దయాకర్, వెంకటేష్, శ్రీనివాస్, మహేష్, మండల నాయకులు వెంకటేష్, ఎర్రవోలు జంగయ్య, అరుణ్, మచ్చగిరి, అశోక్, లింగస్వామి, వివిధ గ్రామాల నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 18(దేశ టైమ్స్ )**



బోనకల్ గ్రామంలోని బోసు బొమ్మ సెంటర్‌లో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. "నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అనే ఆయన నినాదం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రగతిలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. "తుపాకీకి తూటా ఎలాగో.. భారత స్వాతంత్ర్య సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అలాంటిది" అని కొనియాడారు. నేతాజీ చూపిన దేశభక్తి, త్యాగం, ధైర్యం, స్ఫూర్తి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చ గురవయ్య, ఎస్.కె. జాన్ పాషా, రషీద్, నన్నే, బాజీ, మున్న, సిద్దు, వెంకన్న, అన్నమయ్య, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు

## 21న జరిగే AIYF ఖమ్మం జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలి

### AIYF కొణిజర్ల మండల కార్యదర్శి తుప్పతి కౌశిక్ పిలుపు

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 18 (దేశ టైమ్స్ )**



ఈ నెల 21న చింతకాని మండలం కోదుమూరు లో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) ఖమ్మం జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని AIYF కొణిజర్ల మండల కార్యదర్శి తుప్పతి కౌశిక్ పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతం కోసం మండల కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దమునగాలలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుప్పతి కౌశిక్ మాట్లాడుతూ.. 1959 నుంచి AIYF యువజన సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఎలాంటి షూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు అందించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలని కోరారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో చేపట్టాల్సిన దశలవారీ పోరాటాలపై మహాసభల్లో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువకులు అధిక సంఖ్యలో పాల్గొని AIYF 25వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కౌశిక్ కోరారు. ఈ సమావేశంలో AIYF నాయకులు అనిల్, ప్రశాంత్, వినోద్ కుమార్, గణేష్, అరవింద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## లింగరాజుపల్లిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

**వలిగొండ,ఆగస్టు18(దేశ టైమ్స్):**




మండల పరిధిలోని లింగరాజుపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు గంధమల్ల గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాధారణ కుటుంబంలో జన్మించి తన ధైర్యం, పట్టుదల, పోరాట స్ఫూర్తితో ప్రజల కోసం ఉద్యమించిన గొప్ప యోధుడని అన్నారు. మొఘల్ పాలనలో ప్రజలు అన్యాయం, అణచివేతకు గురవుతున్న సమయంలో పాపన్న గౌడ్ ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేశారని తెలిపారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. పాపన్న గౌడ్ కేవలం రాజుగా మాత్రమే కాకుండా ప్రజల మనసులను గెలుచుకున్న నాయకుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కులం, వర్గం అనే తేడా లేకుండా అందరికీ సమాన న్యాయం అందించాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగారని తెలిపారు. ఆయన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడిగె లింగస్వామి, ఉపసర్పంచ్ జయ, బొడిగె సాయిలు, బొడిగె నరసింహ, బొడిగె ఆనంద్, బాలగోని నరసింహ, బొంగు నరసింహ, మునుకుంట్ల రమేష్, పబ్బు నరసింహ, బిక్షపతి, శ్రీను, కిషన్, రాఘవేందర్, వెంకటేష్, పెంటయ్యతో పాటు గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక

దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

# నూతన ఎస్సై ని సన్మానించిన రెడ్ల రేపాక గ్రామ నాయకులు.



**(యాదాద్రి కరస్పాండెంట్)దేశ టైమ్స్, ఆగస్టు 18.**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ఎస్సైగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ని రెడ్ల రేపాక గ్రామ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్లరేపాక గ్రామ సర్పంచ్ దేశ బోయిన బాలస్వామి యాదవ్, మాజీ సర్పంచ్ మాద లావణ్య శంకర్ గౌడ్, ఉప సర్పంచ్ కోమల కుమార్, మహమ్మద్ జానీ, కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు జువ్వగాని సుమన్ గౌడ్, పంతంగి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రవితేజ 'ఇరుముడి'లో 'మల్లెపూల పల్లకి' పాటపై విమర్శలు.. దర్శకుడు శివ నిర్వాణ వివరణ



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న 'ఇరుముడి' చిత్రం నుంచి విడుదలైన 'మల్లెపూల పల్లకి' పాటపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై దర్శకుడు శివ నిర్వాణ స్పందించారు. గాయకుడి వాయిస్ బేస్ పాటను దెబ్బతీసిందంటూ జరుగుతున్న చర్చకు ఆయన వివరణ ఇచ్చారు. ఒరిజినల్ సింగర్‌కు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.ఈ విషయంపై మాట్లాడుతూ... ఒరిజినల్ పాట విడుదలై 15 ఏళ్లకు పైగా అయిందని, వయసు రీత్యా గాయకుడి గాత్రంలో మార్పు రావడం సహజమని శివ నిర్వాణ అన్నారు. సింగర్ వాయిస్ బేస్ సరితూగదనే విషయం తమకు ముందే తెలుసని, అయినా ఆ పాటకు ప్రాణం పోసిన ఒరిజినల్ గాయకుడు డప్పు శ్రీనుతోనే మళ్లీ పాడించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఆయనకు గౌరవం ఇవ్వడం కోసమే ఈ పని చేశామని స్పష్టతనిచ్చారు.మాస్ మహారాజా రవితేజ, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న 'ఇరుముడి' సినిమా నుంచి ఆదివారం ఈ పాట విడుదలైంది. విడుదలైన వెంటనే ఈ పాట సంగీత ప్రియులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచింది. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరచిన ఈ పాటకు చౌడం శ్రీనివాసరావు సాహిత్యం అందించారు. ప్రేమకథా చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన శివ నిర్వాణ, మాస్ ఇమేజ్ ఉన్న రవితేజతో సినిమా చేస్తుండటంతో 'ఇరుముడి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పణలో టీ-సిరీస్ ఫిల్మ్స్‌తో పాటు ఏకేడీ స్టూడియోస్, యూవీ సంస్థలు కూడా నిర్మాణంలో పాలుపంచుకుంటున్నాయి. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాను ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# నిధి అగర్వాల్ కొత్త సినిమా.. ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది.సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

# అనుపమ వ్యాఖ్యల ఎఫెక్ట్.. తొలిసారి మౌనం వీడిన ధ్రువ్ విక్రమ్!

గత కొన్ని వారాలుగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై యువ నటుడు ధ్రువ్ విక్రమ్ తొలిసారి బహిరంగంగా స్పందించాడు. తన సహనటి అనుపమ పరమేశ్వరన్ గతంలో ఓ రెండేళ్ల సంబంధంలో తాను ఎదుర్కొన్న నియంతృత్వం, నార్సిసిజం గురించి మాట్లాడిన తర్వాత, ఆ వ్యాఖ్యలు ధ్రువ్‌ను ఉద్దేశించేనని పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే ధ్రువ్ మౌనం వీడాడు.'ఇండియా టుడే తమిళ్' నిర్వహించిన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ధ్రువ్‌ను.. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటున్నారని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కచ్చితంగా దాని ప్రభావం నాపై పడింది. కానీ, ఇలాంటి సమయంలో వాస్తవానికి కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం. మనం ఎవరో, మన విలువేంటో తెలుసుకోవాలి. మనం ప్రేమించే వారిని, మనకు ముఖ్యమైన ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలి" అని ఆయన అన్నారు.బయటివారి అభిప్రాయాల ప్రభావం తనపై ఎక్కువగా ఉండదని చెబుతూ, "మీరు నిజానికి కట్టుబడి ఉన్నప్పుడు, మిమ్మల్ని ఏది నిలబెడుతుందో మీకు తెలిసినప్పుడు, బయటివారి విమర్శలు ఓ స్థాయిని దాటి వెళ్లలేవు. మనకు తెలియకుండానే మనం ఒంటరి సైన్యంలా మారతాం. మనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని, మన అంతర్గత బలాన్ని కాపాడుకుంటాం" అని ధ్రువ్ వివరించాడు. ప్రముఖుల జీవితాల్లో ఇలాంటి పరిశీలన సర్వసాధారణమే అయినా, తన ప్రియమైన వారిని కాపాడుకోవడం, వ్యక్తిగత హద్దులు గీసుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నాడు. అయితే, ఈ సంభాషణలో ఆయన ఎక్కడా అనుపమ వ్యాఖ్యలను నేరుగా ప్రస్తావించలేదు. వారిద్దరి మధ్య ఏదైనా సంబంధం ఉందన్న ఊహాగానాలపై కూడా స్పందించకుండా సంయమనం పాటించాడు. ప్రస్తుతం ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ కలిసి 'బైసన్ కాలమాడన్' అనే చిత్రంలో నటిస్తున్నారు.




Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280